# పనిమనిషి

నిన్నా ఇవ్వాళాగాదు. దాదాపు మూడు నాలుగేళ్ళ నుండీ సూరాం మాయింట్లో పనిచేస్తున్నది. అదో పనిమనిషిగా, మొదటగా ఏ నాలుగు రోజులు చూశామో ఏమోగాని, తరువాత ఆ ఆలోచనే మాకు రాలేదు. అదిచూడా తనో పనిమనిషి అయినట్టూ, ఏ జీతం డబ్బులకోసరమో తను పనిచేస్తున్నట్టూ, అంతకు మినహా తనకూ మాకూ మరో సంబంధమే లేనట్టూ సూరాం ఎప్పుడూ ప్రవర్తించేదిగాదు దానికీ మాకూ అలా మనసులు కలసిపోయాయి మరి. మా ప్రక్కింటావిడ నెలకు నలుగురు పనిమనుషుల్ని మారుస్తూంటుంది. ప్రతివారూ వెళ్ళేప్పుడు ఆమెమీద నాలుగు దులిపి వెళ్ళటమూ, ఆమెగారు గూడా యథాశక్తి వాళ్ళకు లోపాలు అంటగట్టటమూ రివాజు. మాకెంతో ఆశ్చర్యంగా ఉండేది. ఎందుకంటె, ఎంత మంచి వాళ్ళయినా ఆమెదగ్గర ఎందుకు నిభాయించలేక పోతున్నారు? ఇంకో ఏమిటంటే, ఆమెకు దొరికే పనిమనుషులే అటువంటి వారా? లేక మంచివారినే, ఆమెగారు భరించలేదా?

ఈ విషయాన్ని గురించి మాలో మేము చాలాసార్లు తర్కించుకొన్నాం అప్పుడప్పుడు ఈ తార్కిక సమరంలో సూరాం గూడా పాల్గొనేది. ఎంతలేసి కేకలేసుకున్నా, కొసకు నవ్వులతో మా సమరం అంతమయేది. అంతగాక ఇంకెంతా? కాకపోతే మటుకు ఇటువంటి ముష్టిసంగతులను గురించి దెబ్బలాడుకుంటారా యేమిటి! అసహ్యం.

సూరామను 'సూరాం' అని పిలవడానికి బావ రెండు మూడుసార్లు అభ్యంతరం చెప్పాడు. పనిమనిషి అయినంత మాత్రంచేత అలా తక్కువతనంగా పిల్లవడం భావ్యంగా దన్నాడు. బావమాట మే మసలే ఖాతరు చెయ్యలేదు. ఆయనగారికేం తెలుసూ? సూరామకూ మాకూ ఉన్న సన్నిహిత సంబంధం?

సూరామకు పదకొండు వెళ్ళి పన్నెండో యేడు జొరబడుతుండనంగా, దానితల్లి; దాన్ని మా యింట్లో పనికి కుదిర్చింది నిజం చెప్పొద్దూ? మొదట్లో దాన్ని మేము సుతరామూ నమ్మలేదు. ఎప్పుడూ ఒక కన్ను దానిమీద వేసి ఉంచేవాళ్ళం. అయితే నాలుగు మూడు వారాలకే దాని నిజాయితీ మాకు తెలిసిపోయింది. అప్పట్నుంచే అది మా యింట్లోమనిషిగా కలిసిపోయింది.

దాని తండ్రి లాగుడుబళ్ళు లాగి రోజుకు రెండూ మూడూ, కళ్ళ చూస్తుండేవాడు. తల్లికి ఎల్లకాలమూ రోగాలే! ఎక్కడెక్కడి డబ్బూ, ఆ తల్లి మందులక్రింద హారించిపోయేది. ఇన్నిటికీ సూరాం ఓపికను చెప్పుకోవాలి. రాత్రి ఎనిమిదింటిదాకా సూరాం మా యింట్లో పనిచేసి, అప్పుడు ఇంటికెళ్ళి, తల్లికి ఉపచారాలు చేసేదిట. అదిచేసే చాకిరీ చూసి ఇరుగు పొరుగువాళ్ళు కళ్ళల్లో నిప్పులు పోసుకునేవారు. ఇటువంటి పనిమనిషి ఎక్కడా దొరకదమ్మా, అని దవడలు నొక్కుకొనేవారు. వాళ్ళ పనిమనుషులు ఇంత చాకిరీ ఛస్తే చెయ్యరట. అంతా టైం ప్రకారం. పనిచేస్తారుట.

ఆచేసిన కాసేపయినా గొణుక్కుంటూనో, సణుక్కుంటూనో చేస్తారుట. ఎక్కువ జీతం ఆశపెట్టి ఆ కామాక్షమ్మగారు, లక్షిందేవమ్మగారూ దాన్ని పట్టుకెళ్ళాలని చూశారు. పిచ్చిముండ, సూరాం ఆసంగతులన్నీ మాతో చెప్పి పగలబడి నవ్వేది.

ఏదో ఆరాటంపట్టలేక నలుగురూ అలా అనుకోవటమేగానీ, అదిమట్టుకు పెద్ద చేస్తున్న దేమిటి గనక? ఉదయమే లేచి, గొడ్లపాక, దొడ్డి, నడవా, నడిమిల్లు ఊడుస్తుంది. నీళ్ళుచల్లి ముగ్గు వేస్తుంది. కాకపోతే నాన్న మరీ పట్టింపుగలవాడవడం మూలాన్ని, రోజూ ఇల్లంతా కడుగుతుంది. పదిరోజులకోసారి బూజు దులుపుతుంది. అంట్లు తోమడమూ, చంటాడిగుడ్డలు, చెల్లాయి గుడ్డలు, మడిగుడ్డలు పిండి పెడుతుంది. మైలవాడకానికి కావలసిన నలభైబిందెల నీళ్ళు తోడుతుంది. బజారు వెచ్చాలు పట్టుకొస్తుంది. చంటాణ్ణి, ఏడుస్తుంటే ఎత్తుకుంటుంది. తిన్నకంచాలు కడిగి, ఆమట్టుని పన్నెండింటికల్లా ఇంటికెడుతుంది. తిరిగి మూడింటికేగదా అది మళ్ళా వచ్చేది. సాయంత్రం పాచి ఊడవడమూ, వాడకానికి నీళ్ళు తోడటమూ, స్నానాలకు నీళ్ళు కాచడమూ, ఈలోపుగా అంట్లుతోమడమూ, చంటాణ్ణి ఆడించటమూ, రాత్రికి పక్కలు పరిచి వెళ్ళిపోవడమూనూ.

ఈ రవ్వంతచాకిరికి మేము నెలకు అయిదు రూపాయలిస్తున్నాం. మిగిలిన రోజున చద్దన్నము, చద్దికూరా, చద్దిపచ్చడి పెడుతున్నాం. మొన్నామధ్య అక్కయ్య విడిచేసిన

రెండుజాకెట్లు యిచ్చాం. అమ్మ పాతచీర ఒకటిచ్చిండి. పండక్కు పబ్బానికి అణో బేడో, దానికికొనుక్కోమని ఇస్తుంటాం. దానిచాకిరీ మేము ఉంచుకొన్న దెక్కడా?

మూడేళ్ళ క్రిందట దానితల్లి చచ్చిపోయింది. మూడు రోజులు సూరాం పనిలోనికి రాలేదు. అయినా మేము నాగా కట్టుకోలేదు. కాకపోగా నాన్నగారు, బిళ్ళకుడుములా రూపాయి దాని చేతిలో పడేశారు. ఆ రూపాయి మేము జీతంలో లెక్క కట్టుకోలేదు. ఎందుకు పోనివ్వాలని అక్కయ్య రెండు రోజులు గీమారింది. నాన్నగారు కోప్పడ్డారు. ఇన్ని విధాల మేము దాన్ని ఆదుకొంటున్నాం. ఈసంగతి తెలియక అనేకరకాలుగా అనుకొంటారు. అనుకోమనండి. మాకు లోకులు అడ్డిపోయే దేమీలేదు. అఁహ, అందుగ్గాదు, వీళ్ళ కింత కడుపుమంట ఎందుకా అని?

పాపం! ఇటీవల దానిగ్రహాలు వక్రించాయి. తండ్రి బండిలాగుతూ లాగుతూ బోర్లపడ్డాడుట. దూకుడుగా వస్తున్న బండి అతగాడి నడుంమీదుగా పోయిందట. పదిహేనురోజులు ఆస్పత్రిలో తీసుకుని చచ్చిపోయాడు. వాణ్ణి చూదామని, నాన్నగారు నాలుగైదుసార్లు ప్రయాణమయ్యాడు. ఒకసారి ఎవరో స్నేహితులు రావడంమూలాన్ని పడలేదు. ఇంకో సారి 'దీనజనరక్షణసమితి'కి ఉపన్యాసం ఇవ్వవలసిరావడం మూలాన్ని పడలేదు. అయితేనేం, నాన్నగారు, ఎంతో ఆవేదన ప్రకటించారు. అమ్మ ఆ మూడురోజులు సూరాంకు చాలా చిన్నచిన్న పనులు మాత్రమే చెప్పింది.

అంతదాకా ఎందుకూ, దానిపెళ్ళి చేసింది, మేము గాదూ? కాకపోతే సూరాం మేనమామ సంబంధం మటుకు తెచ్చాడు. అంతటితో అంతా అయిపోయినట్లేనా ఏమిటి? దాని పెళ్ళి నాన్నగారే స్వయంగా చాలా సంస్కారయుతంగా, అంతా పదిరూపాయల ఖర్చులో సరిపోయేట్టు జరిపించాడు. ఇంకొకరెవరన్నా అయితే పనిమనిషికి అలాచేస్తారా? మేము కాస్తోకూస్తో చదువుకొన్న వాళ్ళం గనక, పనిమనిషిని పని మనిషినిలాగా చూడం. దాన్నిగూడా రవంత గౌరవంగా చూస్తాం. అంతా అలానే చూస్తే పనిమనుషులు వారానికి పదిమంది మారవలసిన అవసర మెందుకుంటుంది?

దాని అదృష్టమేమిటోగానీ, మొగుడుగూడా చాలా మంచివాడే. అదంటే పంచప్రాణాలూ విడుస్తుంటాడు. పని దొరక్క అల్లాడిపోతున్నప్పుడు, తెలిసినాయనదగ్గర, నాన్నగారే, ఓరిక్షాయిప్పించారు. దానిమీద వాడు రోజుకు రెండు మూడు కళ్ళచూస్తున్నాడు. వెధవ! వాడుట మాయింట్లో మానుకోమని చెప్పాట్ట. తను సంపాదిస్తున్నదే యిద్దరికీ సరిపోతుందిలేవే అన్నాట్ట. సూరాం మంచిముండగనక సరిపోయింది, లేకపోతే మానుకోనేదిగదా?

అసలు మానుకోవలసింది. వాడి తిక్కకుదిరేది. నిజంగా మానుకొన్నట్లయితే, ఇప్పుడు ఆకుకు అందకుండా, పోకకు పొందకుండా పోయేది. సూరాం మొగుడికి జబ్బుచేసింది. గుండెల్లోమంట, పోటూ పట్టుకున్నాయట. వెధవకు పదిగజాలు రిక్షాతొక్కితే, ఇట్టే ఆయాసం పుట్టుకొచ్చి ఊపి

రాడక నానా హైరానాపడిపోతాట్ట. ఇలాంటివాడు రిక్షా తొక్కలేడుగదా? మాదగ్గిర మానుకొన్నట్లయితే ఇప్పుడు వానిగతేంకాను? పట్టుపట్టుమంటే, ఎవరైనా పనిలో పెట్టుకుంటారా? కూటికీ గుడ్డకూ మాడిపోయేదిగదా! అది మానుకోకపోబట్టే, ఇంత ధారకానికైనా మేమిస్తున్నాం.

ఇచ్చి ఇచ్చామని చెప్పుకోకూడదు గానీ, ఈమధ్య వాడికి పదిరూపాయలు సర్దుబాటుచేసింది అమ్మ. రూపాయకు అణాలు, అణన్నరలూ వడ్డీలు పుచ్చుకుంటున్న ఈ రోజుల్లో అమ్మ అర్ధణా వడ్డీకంటె ఎక్కువ పుచ్చుకోనన్నది. కాకపోతే మొగుడు చేయించిన వెండి కడియాలు మాదగ్గరే అట్టే పెట్టిందనుకోండి. అయినా నే మా కడియాలు కుదవబెట్టుకొని డబ్బిచ్చామా? పూరికొంప గనక, అందునా ఊరిబైట గనక, ఎప్పుడేం ముంచుకొస్తుందో చెప్పలేంగనక, జాగ్రత్తకోసం 'నా దగ్గరే అట్టిపెట్టవే' అన్నది అమ్మ. ఇందులో ఎవరు అనుమానించడానికైనా దురుద్దేశ మేమున్నదీ? పదిమంది సొమ్ము జాగ్రత్త చెయ్యటంలో, బాధ్యతలుంటాయి గానీ, దురుద్దేశాలుంటాయా ఎక్కడైనా? తోచీతోచక ఏదో అనుకుంటే సరిపోతుందా?

అదేం జబ్బో, అదేం మహాలోకమో, ఈపదిరూపాయల మందులు వాడినా అతగాడి రోగం కుదరలేదు. ఇంకా మంచాన్ని అంటిపెట్టుకొనే ఉన్నాడు. ఇంకో యాభై రూపాయలన్నా లేనిదే, రోగం నయంకాదన్నాట్ట డాక్టరు. ఈసంగతి మాతో చెప్పుకొని లబోమని ఏడ్చింది సూరాం. ఆవేళల్లా

మాకు సరిగ్గా అన్నాలు సయించనే లేదు. మూడు నాలుగు రోజులపాటు పనిలోకి రాలేనండీ అన్నది. 'పోన్లే పాపం! అలాగేలే! నాగాలు కట్టుకోన్లే!' అన్నది అమ్మ.

నాలుగోరోజు మధ్యాహ్నం సూరాం పిడికెడు ముఖం చేసుకొని మాయింటి కొచ్చింది. అమ్మను దొడ్లోకి పిలిచి కాళ్ళు రెండూ పట్టుకొని ఆపురుమని ఏడ్చింది. దానికెక్కడా డబ్బు దొరకలేదుట. అమ్ముదామన్నా కొంపలో ఏమీ లేదుట. మంచి మంచి మందులు వాడందే లాభంలేదని, డాక్టరు గట్టిగా అన్నాడుట ఓ ఏభై రూపాయలుంటే ఇవ్వమనీ, అతగాడు కాస్త కోలుకోగానే, రెండు నెలల్లోగానే బాకీమూవత్తూ తీర్చుకొంటాననీ అన్నది.

నిజమే! సూరాం ఆడితప్పదు. అది తీర్చేస్తానంటే, ప్రాణం తాకట్టుపెట్టయినా తీరుస్తుంది. దానిమీద మా కెటువంటి అనుమానమూ లేదు. ఐతేమాత్రం ఒక్కపెట్టున యాభై రూపాయలు ఇవ్వమంటే ఎక్కడ తెచ్చిఇవ్వడం? పోనీ అమ్మదగ్గరఉన్న అరవై రూపాయల్లోను, ఓ యాభై సూరాముకు సర్దుదామన్నా వీల్లేకుండా ఉన్నది. దీపావళికి అక్కయ్యా, బావా వస్తున్నారు. ఆ సమయానికి నాన్నదగ్గర డబ్బు ఉండును ఉండకపోను. వాళ్ళకు కాస్తంత గుడ్డలన్నా పెట్టాలా? క్రిందటిసారి నూలుచీర పెట్టినందుకు, అక్కయ్య ఇప్పటికీ దెప్పిపొడుస్తున్నది. ఈ దఫా అక్కయ్యకు అధమం ఓ చౌకబారు సిల్కుచీరన్నా పెట్టకపోతే బావుండదు. పండగనాడు నలుగురూ పచ్చపచ్చగా, కళకళ్ళాడుతూ తిరుగు

తుంటే అక్కయ్య మాటినుంచుకోకపోవడం ఏమంత బావుంటుంది?

ఇవన్నీ ఆత్మలో ఆలోచించి చిల్లిదమ్మిడీ లేదని ఒట్టు పెట్టుకొని చెప్పింది. ఆఁ...ఒట్టుపెట్టుకుంటే ఏం మునిగి పోతుందేం? ఏమీపోదు. అలా ఒట్టుపెట్టుకోకపోతే సూరాం అమ్మమాట నమ్మేదికాదు మరి. అది నిలువుగుడ్లుపడి కాస్సేపు అందరిముఖాలూ చూసింది. మా గుండెలు కరిగి పోయినయ్. అయినా మేము చేయగలిగిందేమీ లేదాయె. ఏమనుకొనిమాత్రం ఏం ప్రయోజనం?

అనగూడదుగానీ, సూరాం ఉత్త మూర్ఖురాలు. యాభై రూపాయలూ ఆ డాక్టరుకిస్తే తప్ప, తన భర్తకు జబ్బు నయంకాదని దాని విశ్వాసం. ఈ విశ్వాసం మూఢ విశ్వాసమే అవుతుంది. కాకపోతే లోకంలో చనిపోయే వారంతా మందుల్లేకనే చనిపోతున్నారా? తాతయ్యకు మూడువేల రూపాల మందులు వాడాం. ఎందుకు చచ్చి పోయాడు? కామాక్షమ్మగారి తమ్ముడు రెండువందలు ఖర్చు పెట్టాడు. కడుపులో నెప్పి తగ్గిపోయిందా? లేదుగదా? అయి నప్పుడు మందుల్లేకపోతే రోగాలు పోవనడం ఉత్త అవివేకం కాదా? ఎవరి గ్రహచారం ఎలాఉంటే అలా జరుగుతుంది. మారకం రాసిపెట్టి ఉన్నవాడికి ఎన్నిమందులు వాడినా లాభంలేదు. భూమ్మీద నూకలున్నవాడికి ధనియాల రసం తాగకపోయినా, రాయిలాగా లేచి తిరుగుతాడు. ఇవన్నీ మేముసూరాంతో అనలేదు. అంటే మునిగిపోతుందని కాదు

గానీ,అది చాటుకెళ్ళి ఏమైనా అనుకోవచ్చు. అయినా కన్ను పోయేటంత కాటుకెందుకా అని?

ఏమనుకొందో ఏమోగానీ, సూరాం మమ్మల్ని డబ్బడగడం మానేసింది. యథాప్రకారం మా యింట్లో పని చేస్తూనే ఉంది.

ఇన్నిటికీ దానిబుద్ధి ఇలా వక్రిస్తుందని మాలో ఎవ్వరమూ అనుకోలేదు. మొదట్లో నాన్నగారు ఆ మాట అన్నప్పుడు ఎవ్వరమూ నమ్మలేదు. ఎలా నమ్ముతాం! ఇన్నేళ్ళ నుండీ అది మా యింట్లో పని చేస్తుండె. ఒక్క పూచిక పుల్లయినా, మమ్మల్ని అడక్కుండా ముట్టుకోదాయె. అనేక సందర్భాల్లో మేమీసంగతి రుజువుగూడా చేసుకొంటిమి. అటువంటి సూరాం, అలమారాలో ఉన్న యాభై రూపాయలు దొంగిలించిందంటే ఎలానమ్మడం? కానీ నమ్మక తప్పలేదు మరి. ఇంటిలోవారినడిగితే, ఎవ్వరూ తీయలేదన్నారు. నిజంగా తీసి ఉండరు. ఎందుకంటే, నాన్నగారికి తెలియకుండా, అణా కాను అవ్వగాక—తీయడం మాలో ఎవ్వరికీ అభ్యాసంలేదు. అటువంటిది ఇదివరకెన్నడూ జరగలేదు.

ఈ డబ్బు సూరామే తీసి ఉంటుందనటానికి కావలసిన హంగులన్నీ అమ్మ కూర్చిపెట్టింది. సూరాం ఎంత మంచిదయినా, అది అత్యవసరస్థితిలో ఉన్నది. అందులోనూ దానికి కావలసింది గూడా యాభై రూపాయలేనూ. ఆ డబ్బులేనిదే తన భర్త బ్రతకడనే దుర్భ్రమ దానికున్నది. అందుకోసం

సూరాం నానా ప్రయత్నాలూ చేసినట్టు అందరికీ తెలుసు. ఎక్కడా రాగిదమ్మిడీ దొరకలేదనిగూడా అందరికీ తెలుసు. ఆ రోగిష్టి వెధవను బ్రతికించుకో. దామన్న తాపత్రయం కొలదీ అది ఈ పాడుపని చేసి ఉంటుంది. చేసినప్పణ్ణుంచీ, దాని మనస్సు మహా పిరికిపడివుంది. అందుచేతనే, అది, ఆ రోజు మధ్యాహ్నంనుండీ పనిలోకిగూడా రాలేదు. వస్తే మనం ఏమన్నా చేస్తామని భయపడి ఉంటుంది. ఈ కారణాలన్నిటినీ అమ్మ బైటపెట్టిన తరువాత, సూరామే దొంగతనం చేసిందని మాకు రూఢి ఏర్పడింది. అది విినహా మరొకరు ముట్టుకో వలసిన అవసరం ఎవ్వరికీ లేదుగదా మరి?

నాన్న సూరాం గుడిసెదగ్గిర కెళ్ళొచ్చాడు. వాకిట్లో జట్కాబండి ఉన్నదట. లోపలినుండి డాక్టరు వస్తున్నాడుట. నాన్నను చూడగానే సూరాం రెండుచేతులూ ఎత్తి నమస్కా రంచేసిందట. నాన్నగారు ఆ మాటా యీమాటా మాట్లాడి అసలు విషయం కదిపారట. అది లబ్బోమని మొత్తుకున్నదిట. తనే పాపమూ ఎరుగనన్నదట. మంగళసూత్రం పట్టుకుని ప్రమాణం చేసిందట. నాన్నగారు చెడామడా తిట్టి పోలీసు రిపోర్టు ఇస్తానని వచ్చాడుట.

అమ్మా, అక్కయ్యా, తమ్ముడూ తప్పకుండా పోలీసు లకు పట్టివ్వాలన్నారు. చూస్తూచూస్తూ యాభైరూపాయలు ఎలా పోగొట్టుకుంటామన్నారు. ఆ డబ్బుతోటే, మొగుడికి మందు ఇప్పిస్తున్నదనిగూడా చెప్పమన్నారు. నాన్నగారు

స్టేషనుకు వెళ్ళనూ వెళ్ళారు. రిపోర్టు ఇవ్వనూ ఇచ్చారు. సూరామను పోలీసులు పిలిపించారనీ, ఏవేవో అడిగారనీ—అది తనే పాపం ఎరుగనని ప్రమాణాలు చేసింది. బహుశః దాన్ని జైల్లో పెట్టి ఉంటారు.

ఇది జరిగిన నాలుగైదురోజులకు గానీ, అసలు సంగతి బైటపడలేదు.

అదీ! నాన్నగారే కనుక్కొన్నారు. ఒకరోజున నాన్నగారు తమ్ముని గదిలోకి వెళ్లారట. కొత్తబూట్లు, మేజోళ్ళు, రెండు పాంట్లు రెండు చొక్కాలు, కళ్ళజోడు కనిపించాయిట. ఎక్కడివిరా అంటే సమాధానం చెప్పడానికి తడబడ్డాడుట. నిగ్గతీస్తే అలమారాలో డబ్బు తీసుకొన్నానన్నాడు అమ్మ అడ్డంరాకపోయినట్లయితే, తమ్ముణ్ణి చావబాదేవాడు నాన్న. అక్కయ్య వాణ్ణి రెక్కపుచ్చుకొని దొడ్లోకి తీసికెళ్ళింది.

ఈ విషయం బైటపడకుండా మేము చాలాజాగ్రత్తలు తీసుకోవలసివచ్చింది. నలుగురికీ తెలిస్తే ఇంకేమన్నాఉన్నదా? వీధిలో తలెత్తుకు తిరగగలమా? అనవసరంగా, అన్యాయంగా సూరామను అనుమానించినందుకు కాస్తంత విచారించాం. అందుగ్గాను అది జైల్లోంచిరాగానే తిరిగి పనిలోపెట్టుకోవాలనుకున్నాం. నాన్న వెళ్ళి అడిగాడు. సూరాం ఒక్కనమస్కారం చేసి "మీయింట్లో పనిచెయ్యను బాబయ్యా" అన్నదిట.

ఆజీతంతో, అంత నమ్మకంగా అంత చాకిరిచేసే పనిమనిషి మళ్ళా దొరకనేలేదు.

మాకు పట్టుకొన్న విచారమల్లా అదొక్కటే.